# పార్కు.. మార్పునకు మార్కు

● కేఎల్‌రావు ఉద్యానవనంలో థీమ్ పార్కు
● కొత్తగా ఇండోర్ స్టేడియం నిర్మాణం, వాకింగ్ ట్రాక్

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** కేఎల్ రావు పార్కులో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. 'పశ్చిమ'కే ల్యాండ్‌మార్క్ కేఎల్‌రావు పార్కు. నగరంలో బోటింగ్ కెనాల్ ఉన్న ఏకైక పార్కు ఇదే. గత పాలకులు పట్టించుకోపోవడంతో ఈ పార్కు ప్రాభవాన్ని కోల్పోయింది. సరైన నిర్వహణ లేక మూలపడింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నగరపాలక సంస్థ, మేయర్.. పార్కు అభివృద్ధికి పెద్ద పీట వేశారు. పార్కులో సమూల మార్పులకు, నూతన నిర్మాణాలకు రూ. 2.50 కోట్లను వెచ్చించారు. ఇప్పటికే పార్కులో ఇండోర్ స్టేడియం, వాకింగ్ ట్రాక్ పనుల్లో వేగం పెరిగింది.

కేఎల్‌రావు పార్కును థీమ్ పార్కుగా తీర్చిదిద్దడానికి నగర ఉన్నతాధికారులు, మేయర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పార్కు మధ్యలో చుట్టూ బోటింగ్ కెనాల్ మధ్యన థీమ్ పార్కును ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గతంలో సింగ్‌నగర్‌లోని డిస్నీలాండ్ తరహాలోనే కేఎల్‌రావు పార్కు థీమ్ పార్కుగా మార్పులు జరుగుతున్నాయి. మరి కొన్ని నెలల్లో ఇది సందర్శకులకు ఆహ్లాదం పంచనుంది.

**వాకింగ్ ట్రాక్, ఇండోర్ స్టేడియం**

పార్కులో వాకింగ్ ట్రాక్, ఇండోర్ స్టేడియం నిర్మాణం జరుగుతున్నాయి. ఇండోర్ స్టేడియం నిర్మాణ పనుల్లో వేగం పెంచారు. రెండు నెలల వ్యవధిలో స్టేడియం స్ట్రక్చర్ పూర్తవ్వగా, అంతర్గత పనులు ప్రారంభమయ్యాయి. షటిల్ కోర్టుతో పాటు ఇండోర్ గేమ్స్ కోసం నిర్మిస్తున్నారు. పార్కులో ప్రధాన గోడ సమీపంలో వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు. వాకింగ్ ట్రాక్ మధ్యలో వాకర్లు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన గ్రానైట్ టేబుల్ ఏర్పాటు చేయాలని వీఎంసీ అధికారులు నిర్ణయించుకున్నారు.



చిట్టినగర్‌లోని కేఎల్‌రావు పార్క్



ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు



వాకింగ్ ట్రాక్ ఏర్పాటు పనులు

**బోటింగ్ కెనాల్‌కు మరమ్మతులు**

పార్కు బోటింగ్ కెనాల్‌లో మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. కెనాల్‌లో బోట్లపై ప్రయాణించేటప్పుడు తరచూ ప్రమాదాలు జరగడం, పరిమితికి మించి సందర్శకులు ఎక్కిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇలాంటివి పునరావృతం కాకుండా పార్కులో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**నిరంతరం పర్యవేక్షణ**

పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ రాయన భాగ్యలక్ష్మి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నెలలో రెండు సార్లు ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు వచ్చి సందర్శకుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. పనులు వేగంగా పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు.

# సమస్యలకు పరిష్కారం చూపాలి

● మేయర్ భాగ్యలక్ష్మి
● స్పందనలో 23 అర్జీల స్వీకరణ

**పటమట(విజయవాడతూర్పు):** స్పందనలో వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం కమాండ్ కంట్రోల్ రూంలో జరిగిన స్పందనలో ఆమె నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారం చూపాలన్నారు. స్పందనలో మొత్తం 23 అర్జీలు రాగా ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగం – 1, పట్టణ ప్రణాళిక విభాగం – 8, పబ్లిక్ హెల్త్ విభాగం – 8, రెవెన్యూ – 3, ఎస్టేట్– 1, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) – 2 విభాగాలకు సంబంధించి అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

**సర్కిల్ కార్యాలయాల్లో**

వీఎంసీ పరిధిలోని సర్కిల్ కార్యాలయాలలో జోనల్ కమిషనర్లు స్పందన నిర్వహించగా చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగం – 1, సత్యనారాయణపురంలోని సర్కిల్ – 2 కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం – 1, పట్టణ ప్రణాళిక విభాగం – 1 అర్జీలు రాగా పటమటలోని సర్కిల్ – 3 కార్యాలయంలో అర్జీలు రాలేదని అధికారులు తెలిపారు.




స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

# మలేరియా అదుపునకు కృషి

**పటమట(విజయవాడతూర్పు):** నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మలేరియాను అదుపు చేయడానికి ప్రజారోగ్య సిబ్బంది కృషి చేస్తున్నారని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం మలేరియా నిర్మూలన పోస్టర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఆఫ్రికాలో 25 ఏప్రిల్ 2001న ఆరు లక్షల మంది మలేరియాతో ఒకేసారి చనిపోవడం చాలా బాధాకరమన్నారు. ఆ రోజు పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ వరల్డ్ సమ్మిట్ నిర్వహించి ప్రపంచంలో ఎవరు మలేరియాతో చనిపోకూడదని, 2030 నాటికి ప్రపంచం నుంచి మలేరియాను పూర్తిగా తొలగించాలని నిర్ణయించిందన్నారు.

విజయవాడలో రెండేళ్లుగా మలేరియా పూర్తిగా తగ్గుముఖం పట్టిందని, మలేరియా రహితంగా నగరాన్ని తీర్చిదిద్దాలని మేయర్ పిలుపునిచ్చారు. వీఎంసీ బయాలజిస్ట్ డి.సూర్యకుమార్ మాట్లాడుతూ మలేరియా అదుపునకు అనేక కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. అర్బన్ మలేరియా ద్వారా జరిగే కార్యక్రమంలో ప్రజలు మలేరియా నివారణకు ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమ తెరలు వాడాలని, జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకొని సంపూర్ణ చికిత్స తీసుకోవాలని తెలిపారు.

ప్రతి శుక్రవారం ఫ్రై డే – డ్రై డే నిర్వహించి సంపూర్ణ మలేరియా రహిత నగరంగా మార్చడానికి ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లత తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

# జగనన్నకే సంపూర్ణ మద్దతు

● చక్కటి ప్రజాదరణతో జగనన్నే మా భవిష్యత్
● పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** జగనన్నే మా భవిష్యత్ ద్వారా రాష్ట్రంలో చేపట్టిన మెగా పీపుల్స్ సర్వేలో 79 లక్షల కుటుంబాలు జగనన్న పాలనకు మద్దతు తెలిపాయని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 7న ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం చక్కటి ప్రజాదరణతో చురుగ్గా సాగుతోందని చెప్పారు. సోమవారం భవానీపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వెలంపల్లి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 15 వేల సచివాలయాల్లో 7లక్షల మంది జగనన్న సైనికులు సర్వే చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కోటి కుటుంబాలు ఉండగా ఇప్పటికే 79 లక్షల కుటుంబాలు మిస్డ్ కాల్ ఇవ్వడం ద్వారా జగనన్న పాలనకు మద్దతు పలికాయన్నారు. ప్రభుత్వ పాలనపై ధైర్యంగా ప్రజలను అడుగుతున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

**ప్రతిపక్షాలు ఉలిక్కిపడుతున్నాయి**

రాష్ట్రంలో జరుగుతున్న మెగా పీపుల్స్ సర్వే చూసి ప్రతిపక్షాలు ఉలిక్కి పడుతున్నాయని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. లోకేష్ పాదయాత్రకు, చంద్రబాబు నియోజకవర్గాల యాత్రకు ప్రజల్లో స్పందన కరువైందన్నారు. అందుకే వాళ్లపై వాళ్లే రాళ్లు రువ్వుకుని సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. జనసేన, టీడీపీల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఓటు వేయని వాళ్లకూ పథకాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారని చెప్పారు. విజయవాడలో జరుగుతున్న అభివృద్ధే జగన్ పాలనకు నిదర్శనమన్నారు. మరోసారి జగనన్నను సీఎం చేస్తామని ప్రజలు చెబుతున్నారని తెలిపారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# రెగ్యులర్ క్రైంపై ప్రత్యేక దృష్టి

వెస్ట్‌జోన్ ఇన్‌చార్జ్ డీసీపీ విశాల్‌గున్ని

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** స్టేషన్ పరిధిలో బీట్స్ పెంచి రెగ్యులర్ క్రైంలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని కొత్తపేట, భవానీపురం సీఐలకు పశ్చిమ జోన్ ఇన్‌చార్జ్ డీసీపీ విశాల్ గున్ని ఆదేశాలు జారీ చేశారు. కొత్తపేట, భవానీపురం పోలీస్ స్టేషన్‌లను డీసీపీ విశాల్‌గున్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తపేట పీఎస్‌లో డీసీపీ విశాల్ గున్ని తొలుత స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బంది పనితీరు, విధులతో పాటు ముఖ్యమైన కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం, భవానీపురం సీఐ అబ్దుల్ సలామ్‌లు స్టేషన్ పరిస్థితులను డీసీపీకి వివరించారు. స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాల వివరాలు, లాకప్ గదులను పరిశీలించారు. ఇటీవల నమోదైన క్రైం ఎఫ్ఐఆర్‌లపై ఆరా తీశారు. ఆయా స్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ విశాల్‌గున్ని

## బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచార భేరి

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** బీజేపీ మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ, మతోన్మాద విధానాలపై సీపీఎం, సీపీఐ.. సోమవారం 38, 39 డివిజన్ల ఆధ్వర్యంలో విద్యాధరపురం కుమ్మరి పాలెం సెంటర్ నుంచి ప్రచార భేరి కార్యక్రమం ప్రారంభమైంది. సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం వివిధ రూపాల్లో ప్రజలపై భారం మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న, మధ్య తరగతి వ్యాపారులను, పరిశ్రమలను నాశనం చేసిందన్నారు. ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందన్నారు. కార్యక్రమంలో నేతలు ఎం.సాంబశివరావు, పంచదార్ల దుర్గాంబ, డి.రమణబాబు, బుద్దే రాజా, కంచర్ల నాగేశ్వరరావు, ఉప్పలపాటి శివప్రసాదరాజు, సీపీఎం నాయకులు, కార్పొరేటర్ బోయి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనం అలవాటు చేసుకోండి

రేడియో స్టేషన్ విశ్రాంత డైరెక్టర్ కృష్ణకుమారి

**మొగల్రాజపురం(విజయవాడతూర్పు):** పాఠ్యపుస్తకాలతో పాటు విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని ఆలిండియా రేడియో స్టేషన్ విశ్రాంత డైరెక్టర్ ఎం.కృష్ణకుమారి చెప్పారు. సిద్ధార్థ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో వరల్డ్ బుక్ అండ్ కాపీ రైట్‌డే–2023 జరిగింది. ఆమె మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతోందని, దీంతో బంగారు భవిష్యత్తు సొంతం చేసుకోవచ్చన్నారు. కాపీరైట్ అంశంపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలన్నారు. భవిష్యత్తులో ఏదైనా అంశంపై డాక్టరేట్ పొందడానికి పరిశోధనలు సమర్పించేటప్పుడు ఈ అంశం ఉపయోగపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ పుస్తకాలతో పాటు వార్తా పత్రికలు, సమాచారం తెలియజేసే పుస్తకాలు, నైపుణ్యాల పెంపునకు దోహదపడే పుస్తకాలు చదవాలని సూచించారు. కళాశాల గ్రంథాలయ అధికారి వాణిశ్రీ మాట్లాడుతూ బెస్ట్ లైబ్రరీ యూజర్ అనే పేరుతో ఏటా విద్యార్థులకు బహుమతులను అందజేస్తామన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణకుమారిని సత్కరిస్తున్న 'సిద్ధార్థ' కళాశాల ప్రతినిధులు

## ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన



**పెనమలూరు:** గోసాల గ్రామ పంచాయతీ వైకుంఠపురంలో శ్రీకనకదుర్గ ఆలయ నిర్మాణానికి సోమవారం స్థలాన్ని పరిశీలించారు. గతంలో అమ్మవారికి ప్రైవేటు స్థలంలో భక్తులు పూజలుచేసేవారు. అయితే ప్రైవేటు స్థల యజమాని తఖాలీ చేయమనటంతో ప్రత్యామ్నయంగా మరో స్థలం చూసి నిర్మాణం చేయాలని స్థానికులు నిర్ణయించారు. ఈ మేరకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పార్థసారథి వచ్చిన సమయంలో ఆలయ నిర్మాణానికి స్థలం కావాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే సూచనల మేరకు సర్పంచి సంగెపు శ్రీనివాసరావు వైకుంఠపురంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్థానికులకు చూపించారు. ఈ స్థలంలో ఆలయం నిర్మాణం చేయాలని నిర్ణయించారు. సర్పంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ గోసాల అభివృద్ధికి, పేదల సంక్షేమానికి పూర్తిగా సహకరిస్తున్నారన్నారు.

# ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

**మొగల్రాజపురం(విజయవాడతూర్పు):** విద్యార్థులు విద్యతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సిద్ధార్థ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అకాడమీ సలహాదారుడు ఎల్.మోహనరావు చెప్పారు. సిద్ధార్థ కళాశాల మెడికల్ కమిటీ, కళాశాల హెల్త్ క్లబ్ సంయుక్తంగా సోమవారం కళాశాల ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో విద్యార్థులకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ సిబ్బంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. జనరల్, డెర్మటాలజీ, ఆప్తమాలజీ, సైక్రియాట్రిక్, గైనకాలజీ, డెంటల్, కార్డియాలజీ విభాగాలతో పాటుగా ఈసీజీ, బ్లడ్ టెస్టింగ్ చేశారు. విద్యార్థులతోపాటు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ తమ కళాశాల ఆధ్వర్యంలో ఏటా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కళాశాల మెడికల్ కమిటీ ఇన్‌చార్జి విజయ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు


## ఎస్టీవీఆర్ విద్యార్థికి అభినందన

రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి టెంటు దిలీప్ రాష్ట్ర రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. ఉంగుటూరు జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 22న నిర్వహించిన జిల్లా జూనియర్స్ రగ్బీ పోటీల్లో దిలీప్ ఉత్తమ ప్రతిభతో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరగబోయే రాష్ట్ర జూనియర్స్ రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో దిలీప్ ఉమ్మడి కృష్ణా జిల్లా తరఫున పాల్గొంటాడని పాఠశాల వ్యాయామ అధ్యాపకుడు జలసూత్రం వెంకట్రావు తెలిపారు.

దిలీప్‌ను సోమవారం పాఠశాలలో సత్కరించారు. విద్యార్థులు అతన్ని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయురాలు రాణి పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ ఆస్పత్రికి బెడ్‌షీట్స్ వితరణ



**గన్నవరం:** సామాజిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వంతో పాటు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం కోలవెంటి రాజకుమారి జ్ఞాపకార్థం ఆమె భర్త కొడాలి జోసఫ్ రూ.20 వేల విలువైన 60 బెడ్‌షీట్లు, ఆరు పిల్లో కవర్లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇదే ఆస్పత్రిలో సుమారు ఏడేళ్ల పాటు నర్సుగా పనిచేసిన రాజకుమారి రోగులకు విశేష సేవలందించినట్లు చెప్పారు. ఆమె జ్ఞాపకార్థం ఇన్ పేషెంట్ వార్డులో రోగుల కోసం బెడ్‌షీట్లు, పిల్లో కవర్లు అందజేసిన కుటుంబ సభ్యులను అభినందించారు. నర్సుగా, నర్సింగ్ టీచింగ్‌లో ఆమె అందించిన సేవలు అమూల్యమైనవని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి అన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నె సుందరరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సారమ్మ, ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి మహిళలకు ఉచిత శిక్షణ

**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** కేబీఎన్ కళాశాల ఉమన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి మహిళలకు చేతి వృత్తుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు చెప్పారు. ఆ కళాశాల కమిటీ కార్యాలయ ప్రాంగణంలో శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి మహిళలకు వివిధ చేతి వృత్తుల్లో శిక్షణనిస్తూ వారిని తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. డీటీపీ, బ్యూటిషియన్, టైలరింగ్, ఫ్యాషన్ స్టైలింగ్, మగ్గం వర్క్, మెహందీ డిజైన్స్, ఫుడ్‌రెసిపీ, డ్యాన్స్, కంప్యూటర్ కోర్సు (ఫండమెంటల్స్) బాలురకు స్పోకెన్ ఇంగ్లిష్, పెయింటింగ్ అండ్ డ్రాయింగ్, సింగింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. బాలికలకు స్పోకెన్ ఇంగ్లిష్, స్పోకెన్ హిందీ, పెయింటింగ్ అండ్ డ్రాయింగ్, వేదిక్ మ్యాథమెటిక్స్, కంప్యూటర్ బేసిక్స్, డీటీపీ, సింగింగ్ తదితర అంశాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణ రావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి, అధ్యాపకులు శైలజ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న తూనికుంట్ల శ్రీనివాసు

## 30 నుంచి నరసింహస్వామి తిరు కల్యాణ మహోత్సవాలు

**వేదాద్రి(జగ్గయ్యపేట):** ఈ నెల 30నుంచి జరిగే యోగానంద లక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణమహోత్సవాలు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్రరావు అన్నారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో ఆదివారం కల్యాణ మహోత్సవాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి మే7 వరకు కల్యాణ మహోత్సవాలు జరుగుతాయన్నారు. ముఖ్యంగా ఈ ఉత్సవాల్లో స్వామి వారి కల్యాణం మే4వ తేదీ రాత్రి 12 గంటలకు కల్యాణం జరుగుతుందని దీన్ని తిలకించడానికి ఏపీ తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీరుతో పాటు వేసవి కాలం కావడంతో ఆలయ ప్రాంగణమంతా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి 104ను అందుబాటులో ఉంచాలన్నారు. కల్యాణం జరిగే రెండు రోజుల ముందు నుంచే ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచాలన్నారు. నది వద్ద భక్తులకు ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లు, బారికేడ్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆలయ అధికారులు పారిశుద్ధ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవో కె.నాగరాజు, తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, సర్పంచ్ పేరయ్య, చిల్లకల్లు ఎస్ఐ దుర్గాప్రసాద్, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సైన్స్ ల్యాబ్ ఆధునికీకరణకు రూ.లక్ష విరాళం

**రామవరప్పాడు:** విజయవాడ రూరల్ మండలంనున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ఆధునికీకరణ కోసం దాత గుంటక సత్యనారాయణరెడ్డి రూ.లక్ష విరాళాన్ని సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాలరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం భూపాలరెడ్డి మాట్లాడుతూ సైన్స్ ల్యాబ్‌ను ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా మార్పు చేయడానికి రూ.6 లక్షలు అంచనా వేసినట్లు తెలిపారు. ల్యాబ్ ఆధునికీకరణకు దాత ముందుకొచ్చి వితరణ అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ కె.కోటేశ్వరరావు, పాఠశాల పీడీ విజయవర్మ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు విరాళాన్ని అందజేస్తున్న గుంటక సత్యనారాయణ రెడ్డి



## క్లుప్తంగా

### నేడు ఇంద్రకీలాద్రిపై ఆదిశంకరాచార్యుల జయంతి

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్ల వద్ద ఆది శంకరాచార్యుల విగ్రహానికి పంచామృతాభిషేకాలు, అర్చన చేయనున్నారు. సాయంత్రం నగరోత్సవ సేవ జరగనుంది. మల్లికార్జున మహా మండపం నుంచి నగరోత్సవం ప్రారంభమై కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కోమల విలాస్, సామారంగం చౌక్, బ్రాహ్మణ వీధి మీదుగా తిరిగి మహా మండపానికి చేరుకుంటుంది.

### చెస్‌లో రాకేష్ విద్యార్థి ప్రతిభ



**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** వీరమాచినేని విజయలక్ష్మి మెమోరియల్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన చెస్ టోర్నీలో రాకేష్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని సోనిక ఉత్తమ ప్రతిభ కనపర్చడం అభినందనీయమని స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు పేర్కొన్నారు. సోమవారం స్కూల్ ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సోనికను పాఠశాల డైరెక్టర్ ఎన్వీ రావు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అండర్ 11 కేటగిరిలో సోనిక రెండో స్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నామని ఎన్వీ రావు చెప్పారు. సోనిక మరింత ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆయన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి ఫ్రీడమ్‌ఫెస్ట్



**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** నగరంలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యాన ఈ నెల 26, 27 తేదీల్లో 'ఫ్రీడమ్ ఫెస్ట్ – 2023' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ చెప్పారు. ఫెస్ట్ పోస్టర్‌ను సోమవారం కళాశాలలోని కమిటీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజన వెలికితీయడానికి వర్క్‌షాప్, ఇతర పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి, సీఎస్‌సీ విభాగాధిపతి డాక్టర్ దుర్గాప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ రవి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

### మామకు గాయాలు

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** మామ అల్లుడికి మధ్య జరిగిన గొడవలో మామ గాయపడిన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సోమిశెట్టి అమృత, వేణుగోపాల స్వామి భార్యభర్తలు. వేణుగోపాల స్వామికి మద్యం తాగే అలవాటు ఉంది. 23వ తేదీ సాయంత్రం మద్యం తాగిన వేణుగోపాల స్వామి మావయ్య వాళ్ల ఇంటికి వెళ్లి గొడవకు దిగాడు. దీంతో మామ అల్లుడి మధ్య తోపులాట జరగగా, మామ అప్పారావు మెట్లపై పడటంతో తలకు గాయాలయ్యాయి. ఘటనపై అమృత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### భార్యపై కత్తెరతో దాడి

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** భార్యను కత్తెరతో పొడిచి గాయపరిచిన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 118లో ఇరుగు రాణి, చిరంజీవి అనే భార్యభర్తలు నివసిస్తున్నారు. చిరంజీవి ఆటో నడుపుతుంటాడు. ఆటో నడపగా వచ్చిన డబ్బులతో మద్యం తాగి వచ్చి భార్యను వేధిస్తుండేవాడు. ఈ నెల 23వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చిన చిరంజీవి భార్యతో గొడవ పడి పక్కనే ఉన్న కత్తెరతో దాడి చేశారు. ఘటనలో రాణి చేతికి గాయమవ్వగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సోమవారం మరోసారి రాణిపై దాడి చేసేందుకు ప్రయత్నించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేశారు.

### పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



**పెనమలూరు:** జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా పెనమలూరు గ్రామ పంచాయతీలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం చేశారు. సర్పంచి లింగాల భాస్కరరావు మాట్లాడుతూ పంచాయతీలో కార్మికులు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. కార్మికులకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి శీలం సుమతి, వార్డు సభ్యులు గాలంకి లక్ష్మి, కొడాలి దీవెన, కంచర్ల విజయలక్ష్మి, రత్నకుమారి, శ్రీదేవి, వీరంకి రాఘవులు, వెంకటరామకృష్ణ పలువురు పాల్గొన్నారు.